


### గడచిన కథ

[భారత స్వాతంత్ర్యదినంనాడు కరాచీనుంచి న్యూడిల్లీకి విమానంలో బయలుదేరిన నలుగురు ప్రయాణీకులు, విక్రమసింగ్, కాప్టెన్ అభయంకర్, షేక్‌మహమ్మదాలీ, శోభారాణీ అనేవారు తాము ఢిల్లీకి పోవటానికి బదులు హిమాలయాలమీదుగా టిబెట్టుకు పోతున్నట్టు తెలుసుకుంటారు. ఈ వింతప్రయాణానికి వారు అర్థంతెలుసుకునేలోపుగా ఒక అజ్ఞాత ప్రదేశంలో వారి విమానం నిలిచిపోతుంది. ఇక చదవండి]

### రెండవ అధ్యాయం

చలి విపరీతంగా ఉంది. విక్రంసింగ్ తనచేతి గడియారం కేసి చూశాడు. రాత్రి ఒకటిన్నర అయింది. బయట హోరు గాలిమోత వినిపిస్తున్నది. అతను లేచి నిలబడి, మిగిలినవారుకూడా నిద్రలేచినట్టు తెలుసుకున్నాడు. అతను కిటకీగుండా బయటికి చూశాడు. చంద్రుడు మేఘాల చాటుకు వెళ్ళినట్టున్నాడు. కాని అంధకారంగాలేదు. ఎటు చూసినా శూన్యం, నిర్జనం. తలకు కట్టిన బొప్పి తడుము కుంటూ విక్రం మిగిలినవారికి తాను ఏవిధంగా సహాయపడ గలనా అనుకున్నాడు.

అభయంకర్ బయటికి అనేశాడు: "మన చరిత్ర ముగిసింది. ఈ విమానం ఇంకెందుకూ పనికిరాదు. ఇదే మన సమాధి.''

చలితో గజగజలాడిపోతున్న అందరి మనస్సులలోనూ ఇదే ఆలోచన. నిజానికి ఆ విమానం పడిపోయినచోటు ప్రపంచంకాదు. అది పర్వతాల ఎత్తున ఉన్న పీఠభూమి. ఇక్కడ పర్వతాలులాగా కనిపిస్తున్నవి పర్వతాలమీద పర్వతాలు.

"విమానం నేల వాలింది గనక నాకిప్పుడు పైలట్ గాడి భయంలేదు. వాడి అంతు తేలుస్తాను" అంటూ కాప్టన్ అభయంకర్ పైలట్ కూర్చునే కాక్‌పిట్‌కేసి బయలు దేరాడు. మిగిలినవారంతా చూస్తూ ఉండిపోయారు. కొంచెం సేపటికి అతని గొంతు వినపడింది:

"చూడు, విక్రం వీడు చచ్చాడల్లే ఉంది. వీడి రివాల్వర్ తీసేసుకున్నాలే. ఒకసారి ఇలా వస్తావా?"

విక్రం లేచినిలబడి చూశాడు. పైలట్ కంట్రోల్స్ మీదికి వారిగిపోయి పడిఉన్నాడు. అతను వెళ్ళి పైలట్‌ను విమానంలోనుంచి అభయంకర్ సహాయంతో నేలమీదికి దించాడు. పైలట్‌కు స్పృహలేదు, కాని ఇంకా బతికే ఉన్నాడు. బయట హోరుగాలి భరించరాకుండా ఉంది.

"ఇతన్ని విమానంలోకి చేరుద్దాం, తెల్లవారేదాకా మనం చేయగలిగిందేమీలేదు;" అన్నాడు విక్రం.

విమానంలోపలకూడా బిగుసుకుపోయే చలే. అయితే లోపల హోరుగాలిలేదు. విక్రం నిప్పుల్ల వెలిగించి పైలట్ ముఖం పరీక్షించాడు.

"నేనప్పుడే అనుకున్నాను. వీడెవడో చీనావాడు,'' అన్నాడు అభయంకర్.

పైలట్ ఇంకా ఊపిరి పీలుస్తూనేఉన్నప్పటికీ విక్రంకు ఇది శవజాగారంలాగే వుంది. కాకపోతే దీనికి పర్యవసానం ఏమిటో అతనికి తెలీదు. తాము టిబెట్ పీఠభూమి చేరివుండవచ్చునని అతను అంచనావేశాడు. ఇక్కడికి మనుష్యసంచారం ఎన్నివందల మైళ్ళలోపున్నా ఉండవచ్చు. పైగా ఈ ప్రాంతంలో ప్రతిమైలూ కొన్ని ఆమడలకింద లెక్కించాలి. తాము నలుగురు మనుషులు. దారితెలియదు. దగ్గిరవున్న ఆయుధమల్లా ఒక రివాల్వర్. ఇంత చలిలో ఆత్మరక్షణ చేసుకోవడానికి తగిన ఉన్నిబట్టలు ఎవరికీలేవు.

బయటికి చూస్తున్న విక్రంకు అకస్మాత్తుగా ఒక అద్భుతదృశ్యం కనిపించింది. ఒకపక్కగా, యెత్తుగా, సున్నంకుప్పలాటిది ఒక మంచు శిఖరం కనిపించింది. చంద్రుడు ఏ కొండశిఖరం మాటునుండో బయటికి వచ్చాడు. ఆ వెన్నెలలో ఆశిఖరం తళతళా మెరుస్తున్నది. అది యెంత యెత్తున్నదో, యెంత దూరంలోవున్నదో ఊహించడం విక్రంకు సాధ్యంకాలేదు.

రాత్రి చాలా మందగమనంతో గడిచింది. చిట్టచివరకు ఆ మంచు శిఖరంమీద అరుణరేఖలు గోచరించాయి. క్రమంగా కాంతిహెచ్చి పరిసరాలు స్పష్టంగా కనిపించ సాగాయి. హోరుగాలి తగ్గిపోయింది. తమముందు ఒక పెద్ద లోయవున్నట్టు విక్రం తెలుసుకున్నాడు. నేలఅంతా గులకరాళ్ళమయం.

సూర్యోదయమై చలి తగ్గసాగింది. పైలట్‌ను బయటికి తీసుకుపోతే తేరుకుంటాడేమో ననుకున్నారు. వాణ్ణి బయటికి చేరబట్టారు. అనుకున్నట్టే పైలట్ కదిలాడు, కళ్ళుతెరిచాడు, ఆదుర్దాగా అపరిచితభాషలో ఏవో మాటలు చెప్పాడు, ప్రాణంవదిలాడు.

అతని మాటలు శ్రద్ధగా ఆలకించిన విక్రం లేచి నిలబడ్డాడు. అందరూ అతనికేసి ఆశగాచూశారు.

"'వాడు మాట్లాడిన చీనాభాష నా కంతబాగా అర్థం కాలేదు,'' అన్నాడు విక్రం. 'ఇది టిబెట్‌లోభాగం అన్నాడు. నేననుకున్నదే. మనల్ని ఇక్కడికెందుకు తెచ్చాడో సరిగా చెప్పలేదు. కాని ఈ లోయవెంబడి పోతే ఒక ఆరామం ఉన్నదన్నాడు. మనల్ని తప్పకుండా అక్కడికి వెళ్ళమన్నాడు. దానిపేరు షాంగ్రిలా అని చెప్పాడు. 'లా' అంటే టిబెట్‌బాషలో కనుమ అని అర్థం,'' అని విక్రం ముగించాడు.

"వాడు వెళ్ళమంటే ఏమైనట్టు ? వాడికసలు ఒళ్ళుతెలిసే మాట్లాడాడో సంధించే మాట్లాడాడో. ఈ షాంగ్రిలాను నమ్మి ఇంకా కొన్ని మైళ్ళు ముందుకుపోతామా ? మమ్మల్ని ఢిల్లీచేర్చే ఆలోచనలుమాని వాడిమాటలు నమ్మి ముందుకు నడిపిస్తావా ?'' అన్నాడు అభయంకర్, చిన్నపిల్లాడిలాగా మకురుతనంచేస్తూ.

"నీకు పరిస్థితి ఏమీ అవగాహన అయినట్టులేదు, అభయంకర్. ఇది ప్రపంచంలోకల్లా అగమ్యగోచర ప్రాంతం. కొత్తప్రదేశాలు అన్వేషించేవారుసయితం అన్ని రక్షణలతోసహాకూడా ఇక్కడికి రావటానికి సాహసించరు. దగ్గిరలో వుండే మనుష్యసంచారం వొదిలేసి హిమాలయాల కడ్డంపడి కాలినడకను ఢిల్లీ పోదామని నువ్వనుకున్నట్టయితే ఆ ఆలోచన వెంటనే మానుకో!'' అన్నాడు విక్రం.

"నేను నడవగలననుకోను,'' అన్నది శోభారాణి.

"దగ్గిరలో మనుషులుంటే మనం పూరా అదృష్ట వంతులమన్నమాట," అన్నాడు షేక్ మహమ్మదాలీ.

"అయితే మనం ఆరామానికి పోతున్నాం. ఈ లోయ పక్కగా కొండమార్గం ఎక్కి వెళ్ళాలి. మనం వెంటనే బయలుదేరటం మంచిది. ఎందుకంటే ఈ ఆరామం మనం అనుకున్నంత దగ్గిరలో లేని పక్షాన చీకటిపడకపూర్వం మనం ఇక్కడికి తిరిగిరావలసి ఉంటుంది.''

"ఒకవేళ ఈ ఆరామం కనిపిస్తేమటుకు వాళ్ళు మన గొంతులు కోసెయ్యరని ఏమిటి ?" అన్నాడు అభయంకర్,

"బౌద్ధారామాలలో హత్యలు జరిగినట్టు నేనెన్నడూ వినలేదు. ఒకవేళ మనంచచ్చినా విచారించవలసిన అవసరం లేదు. చలికీ ఆకలికీ మనం ఇక్కడఉన్నా చచ్చేతీరుతాం. ఆ శిఖరంవైపుగా ఆరామం ఉంటుందని నా అనుమానం.''

ఓచ్చుమెత్తటానికి పొమ్మని పొలిగాడు కొడుకును తన్నబోతే భార్య అడ్డుపడుతుంది. "రాజు–పేద"లో సుధాకర్, అమ్మాజీ, లక్ష్మిరాజ్యం, ఎన్. టి. రామారావు





"బంగారుభూమి"లో సారంగపాణి, రామచంద్రన్

ఒక్కసారిగా నలుగురూ ఆ మంచుశిఖరంకేసి చూసి సమ్మోహితులైనారు. ఎండలో అది అత్యంత రమణీయంగా కనిపించింది. దాని అందం చూస్తున్న మన నలుగురు ప్రయాణీకుల శ్వాసా ఒక్కసారిగా ఆగినట్టయింది. అటు వైపునుంచి కొండదిగివస్తూ ఎవరో మనుష్యులు కనిపించారు.

"అరె, భగవాన్!" అని గొణిగింది శోభారాణి.

అంతా పది, పన్నెండుమంది వ్యక్తులున్నారు. అందులో కొందరు కుర్చీలాటి డోలీ మోస్తున్నారు. ఈ కుర్చీలో నీలందుస్తులు ధరించిన వ్యక్తి ఒకడున్నాడు. ఆ వ్యక్తులు ఏమి పనిమీద ఆ సమయానికి అటుగా వచ్చారో విక్రంకు తెలియదుగాని, భగవంతుడే వారిని పంపాడని అతనికి అనిపించింది. సనాతన ఆచారాలు పాటించడం తెలిసిన విక్రం ఆ వచ్చేవారికి ఎదురువెళ్ళి, వారు అంత దూరంలో ఉండగానే వొంగి ప్రణామంచేశాడు.

కుర్చీలోని మనిషి దిగాడు. కాలినడకను సమీపించాడు. ఒకసారి విక్రంను ఎగాదిగా చూశాడు. ఆయన వృద్ధుడైన చీనావాడు. తల ముండనంచేసి ఉన్నది. ఆయన విక్రంతో స్వచ్ఛమైన హిందీలో, "నేను షాంగ్రిలా ఆరామంనుంచి వస్తున్నాను" అన్నాడు.

విక్రం మళ్లీ ప్రణామంచేసి తానూ, తన అనుచరులూ ఆ ప్రాంతానికి ఎందుకు, ఎలా రావడంజరిగిందో టూకీగా వృద్ధుడికి తెలిపాడు.

తన కర్థమైనట్టు వృద్ధుడు తలవంచి ఎత్తి, "నాపేరు చాంగ్. మీ స్నేహితులను పరిచయంచేయండి," అన్నాడు.

పరిచయాలయినాక చాంగ్, "మీరు నావెంట దయచేయండి, మా ఆరామానికి దారిచూపుతాను," అన్నాడు.

ఇంతసేపూ మౌనంగావున్న అభయంకర్ మళ్లీ నోరు చేసుకున్నాడు.

"మేం ఎక్కువకాలం వుండడానికి వీల్లేదు. సాధ్యమైనంతత్వరలో తిరిగిపోవాలి. అతి ముఖ్యమైనపనులన్నీ పాడైపోయాయి. తిరిగిపోవడానికి మీ మనుషులను తోడిస్తే డబ్బిచ్చేస్తాం. ఇండియాకుపోవడానికి ఎన్నాళ్ళుపడుతుందో ఉజ్జాయింపుగా చెప్పగలరా?"

"నేను చెప్పలేను," అన్నాడు చాంగ్.

ఈ సంభాషణ జరుగుతూండగా చాంగ్ అనుచరులు బుట్టలువిప్పి పళ్ళుతీసి పంచసాగారు. ద్రాక్షరసం సీసాలు పైకివచ్చాయి. వారుతెచ్చిన పళ్ళల్లో చక్కగా మగ్గిన మామిడిపళ్ళుకూడా వున్నాయి. ఇంత ఎత్తున, ఈ చలిలో మామిడిపళ్ళు ఎలా పండించారో విక్రం అర్థంచేసుకోలేకపోయాడు. క్షుద్బాధ నివారణ అవుతున్నకొద్దీ అతని మనస్సు లోయకు అవతలగావున్న పర్వతశృంగం మీదికి పోయింది.

అతను దానినుంచి దృష్టిమరల్చేసరికి చాంగ్ తనకేసి చూస్తూవుండడం కనిపించింది.

"చాలా అందమైన శిఖరం. దాని పేరేమిటో?" అన్నాడు విక్రం.

"కరాకల్."

"ఎన్నడూ వినలేదు, చాలా ఎత్తా?"

"ఇరవైఎనిమిదివేల అడుగులకు పైగా ఉంటుంది."

"ఇంత యెత్తున్న శిఖరంగురించి ఎన్నడూ వినలేదే? నమ్మదగిన అంచనాయేనా? ఎవరు కట్టారు?"

"ఎవరు కట్టాలి? మా ఆరామవాసులకు గణితశాస్త్రంలో ప్రవేశం లేదనుకున్నారా?"

"అవునవును," అన్నాడు విక్రం.

త్వరలోనే షాంగ్రిలాకు ప్రయాణం ఆరంభమయింది. చాలాదూరం యెగువదారికావడంవల్లా, అంత యెత్తున ప్రాణవాయువు చాలాకొద్దిగా వుండడంవల్లా నడక చురుకుగా సాగలేదు. విక్రం ఒకవేళ నడుస్తూ మాట్లాడ గలిగినస్థితిలోవున్నా డోలీలో ప్రయాణంచేసే చీనావాడు కళ్ళు మూసుకుని నిద్రలోపడ్డట్టు కనిపించాడు. అతను ఒకటి రెండుసార్లు అభయంకర్‌ను పలకరించాలని చూశాడు గాని ఆ కుర్రవాడు నడవడానికి చాలా శ్రమపడుతున్నాడు.

రెండు మైళ్ళు నడిచేసరికి ఎక్కుడు జాస్తిఅయింది. సూర్యుడు మబ్బులచాటుకుపోయాడు. పొగమంచు చుట్టూ కమ్ముకురాసాగింది. ఎగువనవున్న కొండశిఖరాలనుంచి మంచుగుట్టలు విరిగిపడేశబ్దాలు వినవచ్చాయి. చూస్తుండ గానే వాతావరణం చల్లబడి కొద్దిసేపట్లో విపరీతమైన చలి ఆరంభించింది. గాలితోసహా జడివాన ఆరంభించింది, అందరూ తడిసి బిగుసుకుపోయారు. ఎంత కష్టాన్నయినా ఓర్చుకోగల విక్రంకీ ఇక ఎంతోదూరం పోలేననిపించింది. మిగిలినవాళ్ళసంగతి చెప్పనవసరంలేదు. అయితే గుడ్డిలో మెల్ల అన్నట్టుగా త్వరలోనె అందరూ ఒక శిఖరానికి చేరు కున్నారు. ఇక ఎక్కేదారిలేదు, దిగేవారే.

అయితే దిగుడు ఆరంభమయేలోపుగా ఒక కొండగోడ వెంబడి రెండడుగల వెడల్పుగల అంచున కొంతదూరం నడవవలిసివచ్చింది. దీనిని దాటడానికై అందరూ ఒకరి నొకరు తాళ్ళతో బంధించుకున్నారు. ఈ అంచున నడిచే టప్పుడు డోలీవాళ్ళు ప్రదర్శించిన చాకచక్యానికి విక్రం ఆశ్చర్యపోయాడు. ఈ అంచుకు దిగువగా అగాధం ఎంత లోతున్నదో విక్రం తెలుసుకోలేకపోయాడు. ఎందుకంటే ఆ అగాధాన్ని పొగమంచు కప్పేసింది.

క్రమంగా ఈ అంచు పెద్ద బాటగామారి దిగుడు ఆరంభ మయింది. టిబెటనులు ఏదో పాట అందుకున్నారు. వాన వెలిసింది. మళ్ళీ వెచ్చని ఎండవచ్చింది. విక్రం అభయం కర్‌కేసి తిరిగి, "వీళ్ళులేకపోతే మనకు దారితెలిసేదికాదు," అన్నాడు. కాని ఈ మాటకు అభయంకర్‌లో ఉత్సాహం జనించలేదు. అతన్ని ఏదో భయం ఆవహించింది.

"మనం ఎక్కడికి పోతున్నాం ? ఎందుకు ? అక్కడ ఏంచెయ్యబోతున్నాం ? ఏంచూసుకుని మనం సంతృప్తి పడాలి ?" అన్నాడతను.

"నువు కుర్రాడివి. ఒక్కొక్క పరిస్థితిలో నువేమీ చేయనవసరంలేదు. ఏంజరుగుతుందో జరగనివ్వడమే ; ఏవన్నా వింత అనుభవంకలిగితే సంతోషించడమూనూ !" అన్నాడు విక్రం.


"నీ వేదాంతం నా తలకెక్కడంలేదు. ఈ దారి వెంబడి మనం మళ్ళీ వెళ్ళవలిసి వుంటుందన్నది నీకు తట్టలేదా ? నువ్వేమైనాచెప్పు నాకివంతా అనుమానాస్పదంగా వుంది. అన్ని నిర్ణయాలూ వీళ్ళేచేస్తున్నారు. ఇందులో మననిర్ణయంగాని, ప్రయోజకత్వంగాని నాకేమీ కనిపించ లేదు," అన్నాడు అభయంకర్.

"మన ప్రయోజకత్వం ప్రదర్శించాలంటే అక్కడే వుండిపోయి చలికీ, ఆకలికీ మాడి చావవలిసిందే ;"

"కావచ్చు, కాని నేను ఈ పరిస్థితికి సమాధానపడలే కుండావున్నాను. రెండురోజులక్రితం మనం కరాచీ ఆఫీ సులో ఎట్లా కూచునివున్నామో జ్ఞాపకంతెచ్చుకుంటే ఇదంతా మహా భయంకరంగావుంది. అర్థంలేకుండా ఆ మంచు కొండలమీదిగా ఎగిరిరావడం, ఈ కొండల్లో విమానం కూలిపోవడం, పైలట్ చావడం, వీళ్ళు రావడం, దారీ తెన్నూలేని మన ఈ ప్రయాణం—ఇదంతా నీకుమాత్రం

"బంగారుభూమి"లో వాంప్‌గా మైనావతి





"బంగారుభూమి"లో రామచంద్రన్, మైనావతి

పీడకలగా లేదా ? ఈసరికి ఢిల్లీలో స్వాతంత్ర్యోత్సవం అయిపోయివుంటుంది, అందరూ వీడ్కోళ్ళు పుచ్చుకుంటూ వుంటారు."

"ఎందుకు చెబుతావు, అభయంకర్ ? ఇంతకన్న పీడకలలు నేను చాలాచూశాను. ఇంకా పాకిస్తాన్ వేరుకాకపూర్వమే దానిని మింగడానికి బహిరంగంగా ఆలోచనలు చేసేవాళ్ళతో నేను స్వయంగా మాట్లాడాను. కాశ్మీరునుంచి వచ్చిన ఒక పెద్దమనిషీ, ఒకమాజీ అమెరికన్ సైన్యాధికారీ క్లబ్‌లో కూర్చుని తాగుతూండడం చూశాను. వాళ్ళ సంభాషణ నేను వినకపోయినా నాకాదృశ్యం ఏదో పీడకలలో ఒక భాగంలాగే తోచింది. నేను చూసిన రాజకీయాలు నువుకూడా చూసిఉంటే నువ్వీ పీడకలకు భయపడవు" అన్నాడు విక్రం.

వీరి సంభాషణ సాగుతూండగానే మళ్ళీ దారి పైకి మళ్ళింది. చిన్న ఎత్తు ఎక్కి కొండమలుపు తిరిగేసరికి ఎట్టఎదుట షాంగ్రిలా ప్రత్యక్షమయింది.

మొట్టమొదటగా ఆ దృశ్యాన్ని చూసినప్పుడు విక్రంకు విస్మయం కలిగింది. కొండపై రంగురంగుల మండపాల సమూహం కనిపించింది. అవి చాలా అందంగా ఉన్నాయి. వాటికి వెనుకగా కారకాల్ మంచుశిఖరం గంభీరంగా ఆకాశంలోకి లేస్తోంది. మండపాలుగల కొండ నిట్టనిలువునా లోతయిన లోయలోకి దిగిపోతోంది. ఈ లోయ ఆకుపచ్చగా, అందంగా కనిపిస్తోంది. కాని ఆ లోయలో జనం నివసిస్తున్న పక్షాన వారు కొండ ఎక్కడానికి మార్గమేమీ ఉన్నట్టు కనబడలేదు. ఏదైనా మార్గం ఉంటే అది షాంగ్రిలా ఆరామానికి పోయేది మాత్రమే అయిఉండాలి. ఆ దృశ్యాన్నిచూసి విక్రం పొందిన విస్మయంలో కొంత భీతికూడా లేకపోలేదు.

ఆరామానికి తాము చేరుకోవడమూ, తమకు అక్కడ జరిగిన స్వాగతమూ విక్రంకు కలలాగాఉంది. లోపల అంత విశాలమైన చావళ్ళుంటాయనిగాని, అవి అంత నిర్మలంగా ఉంటాయనిగాని, లోపల అంతవెచ్చగా ఉంటుందనిగాని అతను ఊహించలేదు, అతనికిదంతా గమనించే వ్యవధి కూడా లేదు. చాంగ్ తమనందర్నీ ఎక్కడికో అనేక చావళ్ళు దాటించి తీసుకుపోతున్నాడు.

"వచ్చేదారిలో మీసంగతి విచారించనందుకు క్షమించాలి. ఇటువంటి ప్రయాణాలు నాకలవాటులేదు. మీరాపే అలిసిపోలేదనుకుంటాను," అన్నాడు చాంగ్. "మీకు మీ మీ గదులు చూపిస్తాను. మీరంతా స్నానాలుచేస్తారేమో. మేము పెద్దయేర్పాట్లేమీ చేయలేంగాని మీకు ఏలోపమూ జరగకుండామటుకు చూస్తాం. స్నానాలయినాక నాతోబాటు భోజనంచేద్దురుగాని."

విక్రం చాంగ్‌కు సముచితంగా సమాధానం చెప్పాడు. కాని అభయంకర్ మాత్రం తన పాతధోరణిలో, "ఆతరువాత, తమకేమీ అభ్యంతరంలేకపోతే, ఇక్కడనుండి వెళ్ళిపోయే ఏర్పాట్లు చూస్తాం," అన్నాడు.

రాత్రి సమీపిస్తున్నకొద్దీ విక్రంకు షాంగ్రిలామీద ఆదరం హెచ్చింది. అతని కిక్కడి ఏర్పాట్లు చాలా తృప్తికలిగించాయి. అవి ఇంత బాగావుంటాయని అతను భావించి ఉండలేదు. లాసాలో విమానాశ్రయంవున్న ఈ రోజులలో టిబెట్ ఆరామాలలో ఉష్ణోపచారాలుండడం అంత ఆశ్చర్యకరంకాదేమో. అయినా ఇక్కడ జాతీయ విజాతీయ సంస్కృతులు సమ్మిళితంకావడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. అతను స్నానంచేసిన ఆకుపచ్చని పింగాణీతొట్టి అమెరికాలో తయారయినట్టు దానిమీద రాసివుంది. అయితే

తనచేత స్నానం చేయించిన పరిచారకుడు అచ్చమైన చీనా సంప్రదాయంప్రకారం తన చెవులనూ, ముక్కులనూ, కింది కనురెప్పల లోపలిభాగాన్నీ సిల్కుగుడ్డతో తుడిచి శుభ్రం చేశాడు.

విక్రం చీనాలో కొంతకాలం గడిపాడు. ఆకాలం అతనికి ఆనందాన్ని కలిగించింది. చీనావారి ఆచారాలతనికి నచ్చాయి. ముఖ్యంగా చీనావారివంటలో రుచుల సమ్మేళనం అతనికి చాలా నచ్చింది. షాంగ్రిలాలో అతను తిన్న భోజనం అలాటిదే. తాముతిన్న ఆహారంలో, తమ అలసట పోగొట్టడానికి ఏవైనా మూలికలుగాని, ఔషధంగాని కలిపి ఉంటారని అతనికి అనుమానం కలిగింది, ఎందుకంటే భోజనానంతరం తనలోనేగాక తన అనుచరులలో కూడా పెద్ద మార్పు కనబడింది. చాంగ్‌మటుకు తాను పథ్యంమీద ఉన్నట్టుచెప్పి ఉడికిన ఆకులేవో తీసుకున్నాడు. సారాయం కూడా ముట్టలేదు.

ఈ చాంగ్ ఏవిధమైన అనారోగ్యంతో బాధపడు తున్నాడో విక్రం ఊహించలేకపోయాడు. ఆయన ముఖ రేఖలు అస్పష్టంగా ఉన్నాయి, చర్మంపై నూనెమెరు గున్నది. ఆయనకేసి చూస్తుంటే అకాలవార్ధక్యం ప్రాప్తిం చిందో, లేక అతివార్ధక్యాన్ని తప్పించుకు తిరుగుతున్నాడో కూడా సరిగా తెలియరాలేదు. ఆయన వయస్సు ఊహించ డం విక్రంకు అసాధ్యమనిపించింది. ఆయన ముఖంలో మాత్రం కళవున్నది.

తన గదికూడా విక్రంకు నచ్చింది. అందులో చీనా సంస్కృతి ఉట్టిపడుతున్నది. అందులో కాగితపులాంతర్లు వెలుగుతున్నాయి. గది చాలా అనుకూలంగా ప్రశాంతంగా ఉన్నది. తనకేదో మందుపెట్టివుంటారన్న భావంకూడా అతనికి భయంకలిగించలేదు. మందు ఎటువంటిదైనా తనకూ, తన అనుచరులకూ మేలేచేసింది.

"మీరు చాలా అదృష్టవంతులులాగున్నారు. మీ ఆతి థ్యం మరువరానిది. అయితే మీకు తరుచు అతిథులు వస్తా రనుకోను," అన్నాడు విక్రం చాంగ్‌తో.

"చాలా అరుదు. ఇది ఏమంత జనసంచార ప్రదేశం కాదు."

విక్రం నవ్వి, "నన్నడిగితే ప్రపంచంలో ఇంత ఏకాంత ప్రదేశంలేదంటాను. బయటి ప్రపంచంగాలి సోకకుండా మీరు మీ సంస్కృతిని యథేచ్ఛగా పెంపొందించుకో వచ్చు," అన్నాడు.

చీనావారు కొన్నిలాంఛనలను పాటిస్తారు. వారితో సంభాషణ ఉదాత్తంగా జరిపి, కొంత సౌహార్దం ఉత్పత్తి చేసుకుని, నైమిత్తికవిషయాలను తాపీగా, తొణుకులేకుండా ప్రస్తావించాలి. ఈ మర్యాదలను విక్రం బాగా ఎరుగును. కాని మిగిలినవారెరగరు.


శోభారాణి చటుక్కున మాటమధ్య అడ్డంవచ్చి, "మీ ఆశ్రమం గురించి మాకు కొంచెం తెలియబరుస్తారా?" అన్నది.


ఆమె తొందరపాటుకు నొచ్చుకున్నవాడల్లే చాంగ్ కనుబొమలు కొద్దిగా ఎత్తి, "నాశాయశక్తులా మీరడిగిన దానికి సమాధానం ఇవ్వడానికి యత్నించగలను. మీరేమేమి తెలుసుకోగోరుతున్నారు?" అన్నాడు.

"ముందు మీరంతా ఎంతమంది ఉన్నారు? ఏ దేశస్థులు?"

"లామాస్థాయికి చేరుకున్నవారు సుమారు యాభైమంది ఉంటారు. నాలాగా, ఇంకా ఆ దశకు చేరనివారు, కొద్ది మందిమి ఉన్నాం. కాలక్రమాన మాకూ ఆ భాగ్యం లభిస్తుందని ఆశించవలసిఉన్నది. మాలో అనేక దేశాల వారున్నారు. అయితే సహజంగా టిబెట్, చీనాదేశాలవారి సంఖ్య హెచ్చు."

"బంగారుభూమి"లో. రామచంద్రన్, అంజలి





సెప్టెంబరు 15 న "అవ్వయ్యార్" తెలుగు కామెంటరీతోసహా తెలుగు సినిమా ప్రముఖులకు చూపినసందర్భంలో అల్పాహారవిందు జరిగింది

"మా భారతీయులెవరన్నా ఉన్నారా ?"

"చాలామంది ఉన్నారు"

"మీరు అనుసరించే మతమేమిటి ?"

ఇది అడగరాని ప్రశ్న అని విక్రం వెంటనే తెలుసుకున్నాడు. కాని చాంగ్ ఏమి చెబుతాడో చూడాలని ఊరుకున్నాడు.

చాంగ్ కాస్సేపు ఆలోచించి, "అది క్షణంలో సమాధానంచెప్పే విషయంకాదు" అన్నాడు.

విక్రం అడ్డొచ్చి "క్షమించండి. శోభారాణిగారడిగినా, నేనడిగినా ఆ ప్రశ్న అడగడంలో ఒకటే ఉద్దేశం—మీ జీవితాశయం తెలుసుకోవడమే" అన్నాడు.

"అయితే సూక్ష్మంగా చెబుతాను వినండి" అన్నాడు చాంగ్. "మేం ప్రధానంగా అభ్యసించేది మితత్వం. పుణ్యంకూడా మితంగానే సంపాదిస్తామనుకోండి. మీరు చూసిన లోయలో అనేకవేలమంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ అందరి అనుభవమూ ఏమంటే మితత్వంలో జీవితానందం హెచ్చుగా ఉంటుందని. మా నియమాలు మితంగానే ఉంటాయి. వాటిని ప్రజలుకూడా మితంగానే పాటిస్తారు. మా ప్రజలు నీతినీ, శీలాన్నీ మితంగా పాటిస్తారని చెప్పగలను."

ఈ జవాబు విక్రంకు ఆనందంకలిగించింది. ఈరకం వేదాంతం అతని మనస్తత్వానికి చాలా అనుకూలమైనది.

కాని అభయంకర్ ఈ సంభాషణతో సంతృప్తిచెందినట్టు లేదు. అతను ఆకస్మికంగా మాటమార్చుతూ, "ఇదంతా బాగానేవుంది గాని మనం ఆటే జాప్యంచెయ్యకుండా మా తిరుగుప్రయాణంగురించి మాట్లాడుకుంటే బాగుంటుందంటాను. మీరు మాకెంతమంది పోర్టర్లను అందించగలుగుతారు ?" అన్నాడు.

చాలాసేపు మౌనంగావుండి చివరకు చాంగ్, "అభయంకర్‌గారూ, మీ ప్రశ్నకు సమాధానం ఇవ్వగలవాణ్ణి దురదృష్టవశాత్తూ నేనుకాదు. ఏమైనా మీ తిరుగుప్రయాణం ఇంతట్లో అమరుతుందనుకోను," అన్నాడు.

"వీల్లేదు. మా పనులన్నీ పాడైపోతాయి. మావాళ్ళు మాకోసం ఆదుర్దాపడుతూంటారు. మేం తక్షణం వెళ్ళి తీరాలి. ఏమాత్రంవీలున్నా రేపే బయలుదేరవలిసిన పరిస్థితి. డబ్బిస్తే మాకు దారిచూపడానికి మీవాళ్ళు చాలామంది వస్తారని నా నమ్మకం," అన్నాడు అభయంకర్.

చాంగ్ తాపీగా "మీకు సహాయపడగలశక్తి నాకు లేదు," అన్నాడు.

"మీకు బయటిప్రపంచంతో అప్పుడప్పుడూ రాకపోకలుండివుండాలి. ముందుగా ఒక తంతి ఇచ్చినా బాగుండును. ఇక్కడికి తంతి ఆఫీసు సుమారు ఎంత దూరంలో ఉంటుందంటారు ?"

చాంగ్ జవాబు చెప్పలేదు.

అభయంకర్‌కు ఏదోభయం ఆవహిస్తున్నట్టయింది. అతను చప్పునలేచి నిలబడి, "మీరు కావాలని సత్యాగ్రహం చేస్తున్నారు. విక్రం, నీ అశ్రద్ధ వింతగావుంది. మనం వెళ్ళితీరాలి. రేపే–చాలా అవసరం–" అని ఆరంభించాడు.

సమయానికి విక్రం పట్టుకోకపోతే అభయంకర్ కింద పడిపోవలసినవాడే. పడుకునేవేళ అయిపోయిందనిచెప్పి విక్రం మిగిలిన ముగ్గురునీ లేవదీశాడు. ఎవరో సంకేతం చేసినట్టుగా నౌకర్లువచ్చి వారిని ముగ్గురినీ వారివారి గదులకు తీసుకువెళ్లారు. వారు వెళ్ళినాక విక్రం చాంగ్‌కేసి తిరిగాడు.

"నిజానికి మేమంతా అభయంకర్ స్థితిలోనే ఉన్నాం. అతనికి కొంచెం కుర్రతనం. అంతే తేడా. మేం వెళ్ళి తీరాలన్నది నిజం. మీ సహాయం లేకుండా వెళ్ళలేనిమాట నిజమే. రేపే బయలుదేరిపోవాలన్నంత మూర్ఖత్వంలో లేనుగాని మీరు మాకు సహాయం చేయలేని పక్షంలో మరెవరిని అడగాలో తెలుసుకోవాలని నాకూ ఉంది. నేను వెళ్ళిపోవడానికి తొందరపడుతున్నాననికాదు. ఇక్కడ కొంతకాలంఉండి అనేకవిషయాలు తెలుసుకోవాలని నా మనస్సు ఆరాటపడుతోంది," అన్నాడు విక్రం.

"మీరేమీ విచారించ నవసరంలేదు. కాలక్రమాన మీ ప్రయాణం ఏర్పాటు జరుగుతుంది. తొందరపడి లాభం లేదు. అదీకాక మీరూహించినట్లు కూలీలు దొరకరు. ఈ లోయలో ఉండేవారు తమ ఇళ్లువాకిళ్లు విడిచి దూరప్రయాణంచేసే అవకాశంలేదు," అన్నాడు చాంగ్.

"నేనామాట నమ్మలేను. ఇవాళ ఉదయం మీరంతా ఎటో ప్రయాణమైపోతూ మాకు కనిపించలేదా?"

"ఈ ఉదయమా? అది వేరేవిషయం."

"ఎందుచేతా? మాకు కనిపించినప్పుడు మీరెటో ప్రయాణమైపోవడంలేదా?" అన్నాడు విక్రం.


చాంగ్ సమాధానమివ్వలేదు.

"నాకర్థమయింది. మనం కలుసుకున్నది యాదృచ్ఛికంగా కాదన్నమాట. మాకోసమే మీరు బయలుదేర వచ్చారన్నమాట. అంటే మారాక ముందే మీకు తెలుసునన్నమాట. మీకెలాతెలిసింది?" అన్నాడు విక్రం.

చాంగ్ వెంటనే సమాధానం చెప్పలేదు.

"మీరేమీ విచారించనవసరంలేదు. మీకూ, మీ మిత్రులకూ షాంగ్రిలాలో ఎట్టిప్రమాదమూలేదు," అన్నాడతను.

[ఇంకా వుంది]



రిక్షాలాగే తండ్రికి చేదోడుగా బూట్ పాలిష్‌చేసి నాలుగుడబ్బులు సంపాదించే కొడుకు. "దో బిఘా జమీన్"లో రతన్‌కుమార్